అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించను

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- వివిధ కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటన


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. శనివారం నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్‌లో కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి మున్సిపల్, జలమండలి, ఇరిగేషన్ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. డివిజన్‌లోని యూసుఫ్‌నగర్, సఫ్దర్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సమస్యలతో అల్లాడిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూసుఫ్‌నగర్, సఫ్దర్‌నగర్‌లలో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయని, సమయానికి తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజీవ్ గాంధీ నగర్‌లో వర్షాలు వచ్చినప్పుడు డ్రైనేజీలు పొంగి పొర్లడంతో ఇళ్లల్లోకి మురుగునీరు, వర్షపు నీరు చేరి ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజీవ్‌గాంధీ నగర్ నుంచి మైసమ్మ చెరువుకు అనుసంధానంగా పైపులైన్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ అధికారులు లక్ష్మీనారాయణ, ప్రకాష్, రంజిత్, భాస్కర్, నాయకులు గౌసుద్దీన్, ఐలయ్య, వీరారెడ్డి, దుర్గ, రమేష్, సంపత్‌రెడ్డి, రియాజ్, హమీద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పునర్నిర్మాణ పనులను పూర్తి చేస్తాం


జలవాయు విహార్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పునర్నిర్మాణ పనులను తొందరగా పూర్తి అయ్యేలా కృషి చేస్తామని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. శనివారం పాఠశాలలో బోరు పనులను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు.

మురుగునీరు కలవకుండా చర్యలు

జలవాయు విహార్, హెచ్‌ఎంటీ హిల్స్, హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ కాలనీ నుంచి వచ్చే మురుగునీరు భీముని కుంట చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలను తీసుకుంటామని కార్పొరేటర్ శ్రీనివాసరావు అన్నారు. ఆయా కాలనీల్లో సమస్యలను పరిశీలించారు. అలుగు వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు ఏఈ విశ్వం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు మహదేవ్, రతన్ నాయక్, కాలనీ వాసులు పాల్, సుబ్బయ్య, ఎన్‌వీపీ రాజు, లక్ష్మీరాజ్యం, రాజు, పీవీ రావు, త్రినాథ్, రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

మెదడు వాపు నివారణకు టీకా వేయించుకోవాలి



మోతీనగర్: మెదడు వాపు వ్యాధి నివారణకు టీకా వేయించుకోవాలని మోతీనగర్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ మాజీ అధ్యక్షుడు నలమాల్పు అంజిరెడ్డి అన్నారు. శనివారం మూసాపేట డివిజన్ మోతీనగర్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కేంద్రంలో చిన్నారులకు టీకా వేశారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు ఉన్న వారికి టీకా వేయించాలన్నారు. కార్యక్రమంలో హనుమంతరావుగౌడ్, విజయ్ కుమార్, సతీష్ కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికశాఖ జాయింట్ కమిషనర్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న సప్పిడి భాస్కర్

మూసాపేట: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ఒక్కరికి అందించాలని టీపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షుడు సప్పిడి భాస్కర్ కార్మిక శాఖ జాయింట్ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో ఎంతో మంది భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ సరైన సదుపాయాలు లేక, చాలీ చాలని కూలితో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కనీసం ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల గురించి కూడా తెలియదన్నారు. అటువంటి కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందించాలన్నారు.

లీకేజీలతో వృథాగా మంచినీరు


రిక్షాపుల్లర్స్ కాలనీలోని పీజేఆర్ విగ్రహం వద్ద రోడ్డుపై పారుతున్న మంచినీరు


వివేకానందనగర్‌లోని భాష్యం స్కూలు వద్ద ..

ఆల్విన్‌కాలనీ: లీకేజీలతో తాగునీరు వృథాగా రోడ్లపై పారుతుంది. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కలుషిత జలాల ద్వారా వాంతులు, విరోచనలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్ డివిజన్‌లలో ప్రతి కాలనీ వీధుల్లో ఏదో ఒక ప్రాంతంలో తాగునీటి పైపులైన్ల లీకేజీతో తాగునీరు రోడ్డుపై పారుతుంది. కూకట్‌పల్లి సర్కిల్ వివేకానందనగర్‌లోని భాష్యం స్కూలు ఎదుట, జగద్గిరిగుట్ట ఇందిరా గాంధీ విగ్రహం వద్ద, రిక్షాపుల్లర్స్ కాలనీ పీజేఆర్ విగ్రహం వద్ద, ఎల్లమ్మబండ ఎల్లమ్మగుడి ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం ముందు, గోదాకృష్ణ ఫంక్షన్ హాలు సమీపంలో, పీజేఆర్ నగర్ కాలనీ, వివిధ ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీ ద్వారా మురుగు నీరు సరఫరా అవుతుందని స్థానికులు వాపోతున్నారు. వాటర్ వర్క్స్ అధికారులు మొద్దు నిద్ర వీడి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ అధికారుల ముఖాముఖి


ముఖాముఖిలో పాల్గొన్న విద్యుత్ అధికారులు, స్థానికులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ విద్యుత్ అధికారులు భాగ్యనగర్ సెక్షన్‌లోని హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీలో శనివారం విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాలనీ వాసులతో వారి సమస్యలు, విద్యుత్ సరఫరా పరిస్థితులు, సంస్థ ద్వారా అందే సేవలు, బిల్లులు చెల్లించే విధానం గురించి తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ డీఈ చక్రవర్తి, ఏడీఈ ప్రసాద్, ఏఈ షాబాజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ వార్మింగ్ ముప్పును అరికడదాం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి వన మహోత్సవానికి హాజరు


వనమహోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్


ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి మొక్క నాటుతున్న ఎంపీ ఈటల

దుండిగల్: మొక్కల పెంపుతోనే గ్లోబల్ వార్మింగ్ ముప్పును అరికట్టవచ్చని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్ లహరి గ్రీన్ పార్క్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'వన మహోత్సవం' కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రజలు చెల్లించిన పన్నులకు కాపాలాదారులు మాత్రమేనని, అన్నీ ప్రజలు కట్టే పన్నులే అయినప్పుడు కేంద్రం, రాష్ట్రాల వాటా అని విడదీయడం ఎందుకుని, కేంద్ర ప్రభుత్వం చేసే పనులు వందశాతం కేంద్రం నిధులతోనే చేపడతామన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో రైల్వే పనులను కేంద్రం నిధులతోనే పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ఒకప్పుడు సిటీ ఆఫ్ లేక్స్‌గా ఉన్న హైదరాబాద్ నగరం ప్రస్తుతం మురికి కుంటలకు నిలయంగా మారిందని, దీంతో దోమలు, ఈగలు పెరిగిపోవడంతో ప్రజలు జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వనాలు, చెరువులను కాపాడుకుంటేనే మానవ మనుగడ ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వివేకానంద్ తనకు తమ్ముడు లాంటివాడని, తమ మధ్య ఎలాంటి బేషజాలు లేవన్నారు. హైదరాబాద్‌లో సమతుల్య వాతావరణం నెలకొందని, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడు ఉంటుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో లహరి గ్రీన్ పార్క్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు ఉర్సు


ఉర్సులో పాల్గొన్న సునీత మహేందర్ రెడ్డి, దండుగుల యాదగిరి

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లిలోని హజ్రత్ సయ్యద్ నసీరుద్దీన్ షా, క్వాద్రి ఉర్సు శనివారంతో రెండో రోజుకు చేరింది. కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి సునీత మహేందర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఉర్సు ఉత్సవాల ప్రతినిధులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో బలవంత్‌రెడ్డి, దండుగుల అశోక్, షాహిన్, అక్బర్, హంజాదు, సజాద్, గౌస్, సయ్యద్, ముస్తఫ్ అలీ, రమణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు

దేవస్థాన పాలకమండలి సమావేశం


సమావేశంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, సభ్యులు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రం దేవస్థానంలో పాలకమండలి మొదటి సమావేశం శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. నూతన కమిటీ సభ్యులు ఆలయంలోని సమస్యలపై, ఆలయ అభివృద్ధి కోసం తీసుకోబోయే నిర్ణయాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పి.నాగిరెడ్డి మాట్లాడుతూ.. పండుగలు, వార్షికోత్సవం వంటి ప్రత్యేక రోజుల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆలయ ఈఓ విజయభారతి, పాలక మండలి సభ్యులు మూర్తి, వెంకటేష్, లక్ష్మీనారాయణ, సంతోష్, మణెమ్మ, ప్రధాన అర్చకులు సూరిబాబు, యోగానందం, అంజిస్వామి, శారద తదితరులు పాల్గొన్నారు.

20వ ర్యాంకు సాధించిన జ్ఞాన వర్షిణి


స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

కూకట్‌పల్లి: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన ఫలితాల్లో కూకట్‌పల్లికి చెందిన జ్ఞాన వర్షిణి 20వ ర్యాంకు సాధించి పబ్లిక్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా హెల్త్ డిపార్టుమెంట్‌లో ఎంపికైంది. ఉద్యోగానికి మొదటి ప్రయత్నంలోనే ఎంపిక కావటం సంతోషంగా ఉందన్నారు. తల్లి జ్ఞానేశ్వరి, తండ్రి రాజిరెడ్డి శనివారం స్వీట్లు తినిపించారు.


జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రకాష్ గుప్తాకు శుభాకాంక్షలు తెలుపుతున్న జయకుమార్ గుప్తా తదితరులు – కూకట్‌పల్లి


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆయన కార్యాలయంలో శనివారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని దళితులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం శుభసూచికమన్నారు. కార్యక్రమంలో గణేష్ ముదిరాజ్, సత్యనారాయణ, కాశీనాథ్ యాదవ్, వినోద్, మల్లేష్, రాజేందర్, శ్రీనివాస్, వేణు గోపాల్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై జెడ్సీ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ జోన్ కార్యాలయంలో కూకట్‌పల్లి జోన్‌లోని ట్రాఫిక్ పోలీసులు, ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో ట్రాఫిక్ నియంత్రణ, తదితర సమస్యలపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రద్దీని తగ్గించడం, జంక్షన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, బాలానగర్, జీడిమెట్ల, అల్వాల్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని జంక్షన్లు, ఇతర పనులకు సంబంధించి ప్రతిపాదనలు అందజేయాలన్నారు. సర్కిళ్ల పరిధిలో ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. పాదాచారులకు ఫుట్‌పాత్‌లను పునరుద్ధరించాలని సూచించారు. ట్రాఫిక్ జామ్ తగ్గించే చర్యలు చేపట్టి ఫొటోలను పోస్ట్ చేయాలని సూచించారు. రోడ్ల ఆక్రమణలకు గురి కాకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎస్ఈ చిన్నారెడ్డి, డీసీ వి. నర్సింహ, ఏఎంఓహెచ్ కె. శ్రీకాంత్‌రెడ్డి, డీసీ హెచ్. కృష్ణయ్య, మల్లారెడ్డి, ఈఈ గోవర్ధన్ గౌడ్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అవసరాన్ని గుర్తించాలి

రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య


బ్రోచర్‌ను ఆవిష్కరించిన సంస్థ చైర్మన్ వీరయ్య

రాయదుర్గం: మొక్కల పెంపకం, సంరక్షణ బాధ్యత అందరిపైన ఉందని రాష్ట్ర అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెంవీరయ్య అన్నారు. కొండాపూర్ బొటానికల్ గార్డెన్‌లోని రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ కార్యాలయంలో మొక్కల పెంపకం, అటవీ అభివృద్ధి, ఎకో టూరిజమ్‌పై ఆయన శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వన మహోత్సవ కార్యక్రమం బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకతను అందరూ గుర్తించాలన్నారు. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. వర్షాకాలం సీజన్‌లో ప్లాంటేషన్, హార్వెస్టింగ్‌పై ప్రత్యేకంగా సమీక్షించారు. వెదురు, యూకలిప్టస్ చెట్ల అమ్మకాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, ఐఎఫ్‌ఎస్ అధికారి రంజిత్‌నాయక్, సీజీఎం డివిరెడ్డి, అధికారులు స్కైలాబ్, మెదక్, వరంగల్, రంగారెడ్డి, సత్తుపల్లి, పాల్వంచ, కొత్తగూడెం డివిజన్లకు చెందిన డీఎంలు, బొటానికల్ గార్డెన్ ఇన్‌చార్జ్‌లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధనలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు

రాయదుర్గం: పరిశోధనలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడం అవసరమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూలో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్(ఎఫ్‌ఏబీఏ), హెచ్‌సీయూ, సైన్స్ గురుస్ యూఎస్‌ఏ సహకారంతో డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్‌పై రెండు వారాల వర్చువల్ వర్క్‌షాప్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఔషధాల తయారీ సంక్లిష్టమైనదని, వివిధ విభాగాలలో సమష్టి కృషి అవసరమన్నారు.

పాత కక్షలతో ఒకరి హత్య

జీడిమెట్ల: పాత కక్షలతో ఒకరిని హత్యచేసిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జి.మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎస్.కె.ముస్తఫా (38) 20 ఏళ్ల క్రితం నగరానికి వలసవచ్చి కూలీ పనులు చేసుకుంటూ ఫుట్‌పాత్‌లపై జీవిస్తున్నాడు. ముస్తఫాకు గౌస్ అనే వ్యక్తితో స్నేహం ఉండేది, కాగా 2019లో గౌస్ , ముస్తఫాల మధ్య గొడవ జరగగా గౌస్ ముస్తఫాపై దాడిచేశాడు. అప్పట్లో ముస్తఫా ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. కొన్నిరోజుల తర్వాత గౌస్‌కు కోర్టు జైలు శిక్ష విధించింది. 4 నెలల క్రితం గౌస్ జైలు నుంచి విడుదల అయ్యాడు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం జీడిమెట్లలోని గ్యాస్ గోదాం ఎదురుగా ముస్తఫా మృతదేహం పడి ఉండడాన్ని ఓ వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే వారు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేసి గౌస్ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు గుర్తించారు. మృతుడి సోదరుడు తబసుర్ ఫిర్యాదు మేరకు పోలీసులు గౌస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిర్యాదులు స్వీకరించిన విద్యుత్ అధికారులు


కాలనీలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఆస్‌బెస్టాస్ కాలనీలో విద్యుత్ అధికారులు ప్రజల వద్దకు పాలనలో భాగంగా కాలనీ సంక్షేమ సంఘం , స్థానిక ప్రజలతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలైన ట్రాన్స్‌ఫార్మర్లు, కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల వంటి వాటిపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. త్వరలో ఈ కాలనీలో విద్యుత్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో డీఈ భిక్షపతి, ఏఈ శంకర్ నాయక్, ఏడీ కేవల్ కుమార్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేష్, స్థానికులు రఘునాథ్, హుస్సేన్, రఫీక్, దీపక్, సిద్ధయ్య, యూనస్, నర్సింహ, మహేందర్ రెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కోర్టు తీర్పు హర్షణీయం


పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ శనివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎస్సీలతో కలిసి హైదర్‌నగర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మూడు దశాబ్దాలుగా పోరాటం చేసిన మందకృష్ణ మాదిగకు, ఉద్యమకారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హైదర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నర్సింగ్, యువ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, నాయకులు బాగాని శ్రీను, సునీల్, యాదయ్య, రామయ్య, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

హుండీ పగలగొట్టి చోరీ



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనీ ఫేజ్ 3లోని మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి ఉప ఆలయంలో శుక్రవారం రాత్రి హుండీని పగలగొట్టి అందులోని సొమ్మును దుండగులు అపహరించారు. శనివారం ఉదయం వచ్చిన పూజారులు ఆంజనేయస్వామి ఆలయ గేటు తెరిచి ఉండటంతో ఉలిక్కిపడ్డారు. వెంటనే ఆలయ నిర్వాహకులు భాస్కర్‌రెడ్డికి విషయం తెలపడంతో ఆయన జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని ఆలయంలోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. హుండీలో రూ.50 వేల వరకు నగదు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విశ్వవిద్యాలయాలపై నిర్లక్ష్యం తగదు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: విశ్వ విద్యాలయాలపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జేఎన్‌టీయూ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో శనివారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టేట్ టెక్నికల్ సెల్ కన్వీనర్ నాగరాజు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలకు తక్షణమే వీసీలను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పూజిత్, శివమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి


గంగపుత్ర సంఘం ఫ్రెండ్స్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఏడీఈ కృష్ణ తదితరులు

ఓల్డ్‌బోయినపల్లి: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు బోయినపల్లి ఏడీఈ కృష్ణ అన్నారు. శనివారం ఆయన విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని గంగపుత్ర సంఘం ఫ్రెండ్స్ కాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ అఖిల్, లైనింగ్ ఇన్‌స్పెక్టర్ తులసీదాస్, లైన్‌మెన్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బోయిన్‌పల్లి సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ సీబీడీ–సిటీ సర్కిల్–4 పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు, ఏబీ శిష్యుల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజనల్ అధికారి భిక్షపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ప్రాగ టూల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎల్‌అండ్‌టీ ఫీడర్ పరిధిలో ఉదయం10 నుంచి 11:30 గంటల వరకు గాంధీనగర్, ఎల్ అండ్‌టీ, వెంకటేశ్వర స్కై టవర్స్, ఆస్ బెస్టాస్ హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి ఒకటిన్నర వరకు ఏబీ కాలనీ, రసూల్ ఫీడర్, ప్రగతి ప్యాక్, జీహెచ్‌ఎంసీ పార్క్, ఏబీ కాలనీ కమ్యూనిటీ హాల్, లాస్ట్ బస్టాప్ మస్జిద్, రాజ్ ఫుడ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు రంగారెడ్డినగర్, రాజ్ ఫుడ్స్, టెక్నో ఎలక్ట్రికల్స్, బాలాజీ ఎలక్ట్రికల్స్ తదితర ప్రాంతాల్లోని పరిశ్రమలు, బస్తీలు, కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132